# కలల్లో రాకుమారులు

■ ఏ. పుష్పాంజలి

శారద మధ్య తరగతి కుటుంబానికి చెందిన ఆడపిల్ల.

వాళ్ళింటి వాళ్ళకి మధ్యతరగతి వారికుండే ఆలోచనలు పుష్కలంగా ఉన్నాయ్.

వీధిని పోయే ప్రతి బండీ ఆపడం, స్టీలు, ప్లాస్టిక్ తేడా లేకుండా సామాన్లు కొనడం, వాటన్నిటితో ఇల్లు నింపడం, పక్కింటి, ఎదురింటి వాళ్ళతో దాని ధర గురించి గంటలతరబడి చర్చించడం, ఇంట్లో ఆడవారికి నగలు లేకుంటే రోల్డ్‌గోల్డ్‌వైనా కొని తగిలించుకోవడం, ఎన్నో అవసరాలు మానుకుని చీటీలు కట్టడం, నెలకి నాలుగు పండగలొస్తే అవన్నీ తు.చ తప్పకుండా జరుపుకోవడం, ఇవన్నీ అభివృద్ధి కార్యక్రమాలుగా భావించడం లాంటి అలవాట్లు చాలా ఉంటాయి వాళ్ళకి. ఆ వాతావరణంలో పుట్టి పెరిగిన శారద తాను పట్టు పరికిణీ, చెవులకు లోలాకులు పెట్టుకుని స్కూల్‌కు వెళ్ళినప్పుడు మిగతా అమ్మాయిల కన్నా గొప్పగా ఫీలయేది.

అలాగని ఆమెకు ఆడంబరాలంటే మోజనీ, అహంకారి అనీ కాదు. ఆ మాటకొస్తే శారద చాలా మంచి పిల్ల. అయితే, అనేక మంది అమ్మాయిల్లాగానే ఆ పిల్ల ఒక వయసు రాగానే తన పార్టనర్ లేక ప్రియుడు లేక తన జీవిత భాగస్వామి ఎలా ఉంటాడా అని ఆలోచించేది.

క్షణంలో ఉవ్వెత్తున లేచి అణగిపోయే ఆలోచనల్లో అప్పుడప్పుడూ 'తాను బావుంటుందా' అనుకోవడం, అద్దం చూసుకోవడం, ఒకవేళ తనలో ఏదైనా సినిమా హీరోయిన్ పోలికలున్నాయా అని వెతుక్కోవడం చేస్తుండేది. ఆమె ఏ సినిమా యాక్టర్నీ పోలి ఉండదు. అయినా, బావుంటుంది. 'స్టన్నింగ్ బ్యూటీ' కాకున్నా, ఆమెలో ఏ వంకరా లేదు. సాదా సీదా ఆడపిల్లలాగా బొట్టూ, కాటుకా, తలలో కాస్త పూలతో చూడముచ్చటగా ఉండేది.

శారద ఇంటి వాళ్ళు ఆమెను ఆమెలా కాక మరోలా ఉండనిచ్చేవారు కారు.

ఆమె వాళ్ళనూ, వీళ్ళనూ చూసి కాస్త స్టైల్‌గా ఉందామనుకున్నప్పుడు అహర్నిశలూ ఆమెని గమనించే బామ్మ, వంటింటికంకితమైన తల్లీ రంగంలోకి దూకి ఆ ప్రయత్నాలకి స్వస్తి చెప్పించినంతవరకూ వదిలేవాళ్ళు కాదు.

వాళ్ళక్కయ్య వనజ అప్పటికే చదువు మానేసి పెళ్ళికూతురు కావడానికి సిద్ధంగా ఉంది.

అక్క ప్రవర్తన శారదకి విచిత్రంగా తోస్తుండేది.

అదేపనిగా టీవీ చూడ్డం, ప్రపంచంలో ఉన్న హీరోహీరోయిన్ల పేర్లన్నీ గుర్తుంచుకోవడం ఆమెకు సరదా. వాళ్ళ హేర్ స్టైల్స్ వగైరాలు గమనించి, తాను అలా చేసుకోవాలని అనుకోవడం కాక, శారదని బలవంతంగా కూర్చోపెట్టి అలంకరించడం, అది చూసిన బామ్మ, అమ్మ శారదని తిట్టడం చేసేవాళ్ళు.

పెళ్ళి చూపులకి ఎవరైనా వస్తే, "శారూ, అతడు కాస్త నాగార్జున లాగా లేడూ" అనడం, లేకపోతే "శోభన్‌బాబు పోలికలు కొట్టొచ్చినట్టున్నాయ్" అనడం, "అబ్బా, గడ్డం కాస్త పెంచితే షా రుఖ్ ఖానే" అనడం చేసేది వనజ.

కానీ, వచ్చే 'బావగార్ల'లో శారదకి ఆ పోలికలే కనిపించేవి కావు.

చాలామంది ఆడపిల్లలు 'అతడు' అందగాడై ఉండాలని కోరుకుంటారు. వాళ్ళల్లో కాస్త సినిమా యాక్టర్ల పోలికలుంటే ఇక చెప్పక్కర్లేదు.

ఈ నేపథ్యంలో శారద తన ఊహా సుందరులతో పాటు ఆమె భర్త ఎలా ఉంటాడా అని కూడా ఊహించేది. ఆమె ఊహల్లో ఆనంద్ తనతో మాట్లాడిన సన్నివేశం కూడా ఉండేది.

అక్కాచెల్లెళ్ళిద్దరూ ఒకరు తన భర్త గురించీ, మరొకరు కాబోయే బావగారిని గురించి ఊహల్లో మునిగి తేలుతుండగా, వనజకు పెళ్ళి సంబంధం కుదిరింది. వరుడు రామ్మూర్తికీ, తమ ఊహాసుందరులకీ పోలికలే లేవు!

ఓ లక్ష రూపాయల కట్నం ధారబోసి ఈ సంబంధం కుదుర్చుకొచ్చాడు తమ మధ్యతరగతి నాన్న.

ఇద్దరాడపిల్లల్ని కని, వాళ్ళకి కట్నాలకి డబ్బులు కూడబెట్టి, వరుళ్ళని వెదకడానికి అతని జీవితమే వెచ్చించాల్సి వస్తోంది.

మామూలు ఎత్తు, మామూలు ముఖంతో చాలా మామూలుగా ఉండే మనిషి రామ్మూర్తి.

'ఇంత మామూలు మనిషిని పెళ్ళి చేసుకోవడానికి అక్క ఎలా ఒప్పుకుంది' అనుకుంది శారద. ప్రపంచంలో తొంభై తొమ్మిది మంది అలాంటి మామూలు మనుషులేనని ఆమెకి తెలియదు.

"తాను మాత్రం ఇంత మామూలు మనిషిని పెళ్ళి చేసుకోవడానికి చచ్చినా ఒప్పుకోరాదు" అన్న నిర్ణయం కూడా తీసుకుంది. హైస్కూలు చదువైపోయి, ఉన్న ఊర్లోనే ఇంటర్లో చేరింది శారద. మొదట్లో కాలేజీ వాతావరణం కొత్తగా, భయంభయంగా ఉండేది. రానురానూ ఆ భయం పోయి, తాను కాక ఇంకా క్లాసులో ఉన్న వాళ్ళని గమనించసాగింది.

పాఠం పూర్తయ్యాక లెక్చరర్, 'ఎనీ డౌట్స్' అనగానే వెంటనే లేచేవాడు 'ప్రతాప్'.

ప్రతి లెక్చరర్నీ డౌట్లు అడగడం, ఏదైనా సమస్యలొస్తే క్లాసులో ప్లాట్‌ఫారం ఎక్కి ఉపన్యాస ధోరణిలో మాట్లాడడం, ఆ సమస్యను పరిష్కరించడానికి ప్రిన్సిపాల్‌తో ధైర్యంగా మాట్లాడడం, అమ్మాయిల్నెవరైనా ఏడిపిస్తే తన గ్రూప్‌తో వాళ్ళని ఎదుర్కోవడం లాంటి 'లీడర్‌షిప్ క్వాలిటీస్' అతన్లో పుష్కలంగా ఉన్నాయ్.

ఆ క్లాస్‌లో ఉండే ఇరవై మంది అమ్మాయిలకీ ప్రతాపంటే అభిమానం. శారద ఊహాసామ్రాజ్యంలో ఆనంద్ చెరిగిపోయి ప్రతాప్ చేరిపోయాడు.

బావ రామ్మూర్తిని ప్రతాప్‌తో పోల్చుకొంటుండేది శారద. 'కలెక్టరాఫీసులో క్లర్క్ ఉద్యోగం వెలగబెట్టే రామ్మూర్తి బావ ప్రతాప్‌తో పోల్చుకుంటే అసలేం పెద్ద అందగాడు? ఏం పెద్ద తెగువా సాహసాలు కలిగినవాడు' అనుకొనేది.

ఇలాంటి ఆలోచన ప్రతి ఆడపిల్లకూ వస్తూనే ఉంటుంది. "అబ్బే, ఏం లేదు. నా పెళ్ళయ్యేటంత వరకూ పరాయి మొగాడి గురించే ఆలోచించలేదు" అని ఎవరైనా అన్నారంటే అది నూటికి నూరు పాళ్ళూ అబద్ధమే.

ఎలిమెంటరీ సెక్షన్లోనే 'రాజు'ను చూస్తే ఒకవిధమైన 'అడారేషన్' ఉండేది. రాజు చక్కగా చదువుతూ, ప్రతి దాంట్లో ఫస్ట్ వచ్చేవాడు. అందరమ్మాయిల్లా శారద కూడా రాజును అభిమానిస్తుండేది.

హైస్కూల్ రోజుల్లో అయితే, తన క్లాస్‌లో తెల్లగా, పొడవుగా ఉంటూ, బాగా చదువుతూ, రోజూ చక్కగా డ్రెస్సయి వచ్చే 'ఆనంద్' అంటే శారదకి చాలా ఇష్టంగా ఉండేది.

రాత్రి భోంచేసి పడుకున్నాక నిద్రపోయే ముందు కాసేపు ఆ వేళ క్లాసులో ఆనంద్ ఏం చేశాడు? ఎలా మాట్లాడాడు? ఎలా ప్రవర్తించాడు అన్న విషయాలన్నీ నెమరు వేసుకుని ఆ తర్వాత నిద్రపోయేదామె.

అంతమాత్రం చేత ఆమె ఆనంద్‌ని ప్రేమించిందని గానీ, అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకుంటుందని గానీ అనలేం. అంత ధైర్యం కూడా లేదామెకు పాపం.

ఆనంద్ రేవతితో మాట్లాడితే శారదకు నచ్చేది కాదు.

మిగతా చాలామంది అమ్మాయిల్లాగా శారద కూడా బోయిస్‌తో మాట్లాడేది కాదు. కానీ, రేవతి మాత్రం అవసరమున్నా, లేకున్నా మిగతా ఆడపిల్లలతో మాట్లాడినట్టే మగపిల్లలతోనూ మాట్లాడేది. ఆనంద్‌తో మరీ.

"అసలు ప్రతాప్ తనతో మాట్లాడతాడా? ఎందుకు మాట్లాడతాడు? అతనికీ తనకీ మధ్య మాటలేముంటాయ్? అసలు అతను మాట్లాడితే తానేం చేయాలి" అనుకొని భయపడేది కూడా.

ఫస్టియర్ పూర్తయ్యాక ప్రతాప్ టీసీ తీసుకొని గుంటూరు రెసిడెన్షియల్‌కి వెళ్ళిపోయాడు.

అదే సంవత్సరం కొత్త ఇంగ్లీష్ జె.ఎల్ సుకుమార్ కక్కడ ఫ్రెష్ పోస్టింగ్ అయింది.

పేరు తగ్గట్టుగానే సన్నగా, ఎత్తుగా, జాజిపూవు లాంటి నవ్వుతో ప్లెజెంట్‌గా ఉండేవాడతను.

చాలామంది ఉపాధ్యాయులు పాఠం తమకేదో 'తప్పనిసరి తలకాయ నొప్పి'యినట్టు చెబుతుంటారు. కానీ, సుకుమార్ ఓ బండరాయి మాట్లాడినట్టు కాకుండా, మధ్యమధ్యలో బోలెడన్ని జోకులు చెప్తూ క్లాసంతా చైతన్యంతో నింపేవాడు.

అందరి హృదయాల్తో పాటు శారద హృదయం కూడా ఇట్టే చూరగొన్నాడు. ఊహాసామ్రాజ్యం నుంచి ప్రతాప్ నిష్క్రమిస్తుండగా, ద్వారంలో సుకుమార్ పొంచి ఉన్నాడు ప్రవేశం కోసం.

లెక్చరర్ కాబట్టి కాస్త కష్టంగానే ప్రవేశం దొరికింది. తన లీషర్ టైమ్‌లో తనకంటూ తాను చేసుకునే ఆలోచనల్లో సుకుమార్ గారిని గురించిన ప్రస్తావన తప్పక ఉండేది. సీనియర్ ఇంటర్ అయిపోతుందనగా చాలామంది అమ్మాయిలు తమ డౌట్లు తీర్చుకోవడానికి సుకుమార్ మాస్టారి చుట్టూ మూగి, ఆయన్తో నవ్వుతూ, తుళ్ళుతూ మాట్లాడేవాళ్ళు

అందువల్ల సుకుమార్ శారద కలల్లో స్థానాన్ని పోగొట్టుకున్నాడు. ఒక స్త్రీ-పురుషుడు అలా నవ్వుతూ మాట్లాడితే తప్పన్న వాతావరణంలో పెరుగుతున్న శారద నిర్దాక్షిణ్యంగా తన ఊహాసామ్రాజ్యం నుంచి అతడికి ఉద్వాసన చెప్పింది.

రాజు, ఆనంద్, ప్రతాప్ వాళ్ళందరి గురించిన మూకుమ్మడి ఆలోచనలు చుట్టుముట్టేవి.


మంచి మార్కులతో ఇంటర్ ప్యాసైన శారదను డిగ్రీలో చేర్పించాలా, వద్దా అన్న తర్జన భర్జనలు జరిగాయి. "సరే. కట్నానికి ఇంకాస్త డబ్బు పోగైనంత వరకు పిల్ల చదువుకొంటే పోయేదేముంది" అనుకున్న వాళ్ళ నాన్న ఆమెని డిగ్రీలో చేర్పించాడు.

కాలేజీలో చేరాక మొదట భయం, సంకోచం. కొన్ని రోజులు తర్వాత అవి తగ్గి పరిశీలన మొదలైంది.

డిగ్రీ కాళాశాల్లో అబ్బాయిలు, అమ్మాయిలు అందరూ కొత్తవాళ్ళే.

'ఫాతిమా' అనే ఓ ముస్లిం అమ్మాయ్ బురఖాలోనే కాలేజీకొచ్చి చదువుతుండేది. ఎప్పుడూ శారద పక్కనే కూర్చొనేది.

వాళ్ళది ట్రెడిషనల్ ముస్లిం ఫామిలీ. తాతముత్తాతలంతా మక్కా వెళ్ళి వచ్చి, రోజుకు అయిదు సార్లు నమాజు చేస్తారట. వెయిటింగ్ రూమ్‌లో బురఖా తీస్తే ఫాతిమాని మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేది.




**చాలా మంది ఆడపిల్లలకు 'అతడు' అందగాడై ఉండడమే కాక, వాళ్ళల్లో సినిమా యాక్టర్ల పోలిక లుంటే ఇక చెప్పక్కర్లేదు.**

ఇంతలో ఆ క్లాస్‌లో 'రఘు' అనే అబ్బాయి అందంగా ఉంటూ, లీడర్‌షిప్ క్వాలిటీస్ కూడా కలిగి "అందర్నీ ఆకర్షించే అయస్కాంతం" అయి కూర్చున్నాడు.

మామూలుగానే శారద తన బావ రామ్మూర్తితో రఘుని పోల్చుకోసాగింది. ఆమె వీళ్ళందర్నీ రామ్మూర్తితో పోల్చుకుంటూ ఉండడానికి ఆమెకే స్పష్టంగా తెలియని కారణం ఒకటుంది.

తన కుటుంబం వాళ్ళు తేగలిగిన అల్లుడికి రామ్మూర్తి ఒక శాంపిల్. అందుకే ఆమె అప్రయత్నంగా తన కలల రాకుమారులను రామ్మూర్తి బావతో పోల్చుకొనేది.

"తన ఊహాసామ్రాజ్యానికి రఘుని ఏకచత్రాధిపతిగా చేద్దాం" అనుకుంటుండగానే రఘు అంటే ఫాతిమాకి చాలా ఇష్టమన్న నగ్న సత్యం తెలుసుకొంది శారద.

ఫాతిమాకు చదువు మీద ఇసుమంత ధ్యాస కూడా లేకపోగా, శారద దొరికినప్పుడల్లా రఘుని గురించి చెప్పడం, రఘు క్లాస్‌లోకి వస్తోంటే శారదని గిల్లడం లాంటి పనులు కానిచ్చేది.

ఇంట్లో వి.సి.పి.లో బాంబే సినిమా క్యాసెట్టు ఇరవై సార్లు చూసి ఉన్న ఫాతిమా తనకు తాను మనీషా కొయిరాలా లాగా, రఘు అరవింద స్వామి లాగా కనిపించడం ఎంతమాత్రం అసహజం కాదు.

కానీ, తన ఊహాసామ్రాజ్యంలో ప్రతిష్ఠించదలచుకొన్న వ్యక్తి గురించి ఫాతిమా లాంటి ఎవరో ఊహించడం శారదకు నచ్చలేదు. మాటమాటకి "వాళ్ళు వైదిక బ్రాహ్మలు తెలుసా" అని హెచ్చరించేది.

ఈ పాయింటును గడ్డిపోచ కన్నా హీనంగా తీసిపారేయడమే కాక, తన చుట్టూ బిగించుకొన్న మత సంకెళ్ళని రఘూపై ప్రేమ ద్వారా సడలింపజేయడం ప్రారంభించింది ఫాతిమా.

రఘుపై తనకున్న 'ఇది'ని శారద వద్ద బహిరంగంగానే చెప్పేది. శారద హెల్ప్‌లెస్‌గా చూస్తుండగానే రఘు ఆమె కలల సామ్రాజ్యం నుంచి ఆటోమాటిక్‌గా నిష్క్రమించాడు.

అంతేకాదు, ఫస్టియర్ పరీక్షల తర్వాత రఘు, ఫాతిమా ఇద్దరూ ఆ ఊరు నుంచి నిష్క్రమించారు.

వాళ్ళ 'ఎక్సోడస్' గురించి అందరూ మాట్లాడుకునే మాటలు వింటుంటే శారదకెంతో భయమేసింది.

సెకండియర్ మూడు నెలలు చదువు పూర్తవుతుండగా శారదకో సంబంధం కుదిరింది. ఆ ఊరివాళ్ళే.

వరుడు భాస్కర్ తండ్రి 'స్వతంత్రరావు' హరిజనుల చేతి నీళ్ళు తాగి, వాళ్ళ వంట తినే చండాలుడట. రాహుకాలంలో పనులు పూర్తిచేసుకొని వచ్చే మూఢుడట. కూతురి పెళ్ళి మంగళవాద్యాలు లేకుండా చేసిన దగుల్బాజీ వాడుట. భార్య శుక్రవారం పేడ కళ్ళాపి చల్లితే, శుక్రవారమే ఈ చల్లడం ఎందుకని ఆమెను తిట్టే వెధవట. ఇన్ని అవలక్షణాలున్నవాడు కొడుక్కి కానీ కట్నం పుచ్చుకోకుండా పెళ్ళి చేసుకునే అసమర్థుడు కావడంలో ఆశ్చర్యమేముంది? స్వతంత్రరావు నాన్న మరీ అనామకుడు, అసమర్థుడునై స్వాతంత్ర్య పోరాటంలో ఆస్తిపాస్తులు పోగొట్టుకొని తనకు పుట్టిన ఒక్కగానొక్క కొడుక్కి 'స్వతంత్రరావు' అని నామకరణం చేసి చక్కాపోయాడు.

పెళ్ళికి ముందు 'కాఫీ'కి తమ ఇంటికి వచ్చిన భాస్కరరావుని చూస్తే శారదకెందుకో ఓ విధమైన ఏవగింపు కలిగింది. తామంతా టూరు పోయినప్పుడు శృంగేరీలో బొరుగులు చల్లితే అవి తినడానికి బైటకొచ్చే చేప గుర్తు రాసాగింది. ఇంట్లో అందరూ "మంచివాడు" అని వేనోళ్ళ పొగుడ్తున్నా, ఆ మంచితనం ఏమీ ఆమె హృదయానికి తట్టనే లేదు. తన కలల రాకుమారుల స్థానంలో అసలు ఏమాత్రం అందంగా లేని ఈ భాస్కరరావెక్కడ దాపురించాడు అనుకొంది.

గ్రీకు వీరుడు రాకున్నా, కార్గిల్ సైనికుడైనా ఫరవాలేదనుకొంటే చివరికి...

పెద్దలను ఎదిరించే ధైర్యం లేని శారద ఇష్టం లేకుండానే భాస్కరరావుని పెళ్ళి చేసుకుంది.

బ్యాంక్ క్లర్క్‌గా ఉన్న భాస్కరరావుకు మధ్యతరగతి భేషజాలు, ఆడంబరాలు, ఫాల్స్ ప్రిస్టేజీలు ఇంచుకైనా లేవు.

స్వతంత్రరావు ఆధ్వర్యంలో చిన్న నాటి నుంచీ గొప్ప రచయితలుగా పేరు పొందిన వారి పుస్తకాలన్నీ చదివి మానసిక పరిణతి సాధించాడు భాస్కర్.

పెళ్ళికి వచ్చిన వనజ లక్ష రూపాయల కట్నం తీసుకొన్న రామ్మూర్తి గొప్పవాడనీ, ఏమీ కట్నం తీసుకోని భాస్కర్ పనికిమాలిన వాడని అర్థం వచ్చేటట్టు మట్లాడి శారద మనోవ్యథ ఇంకా



**ఈరోజు శారదలో పరిణతి చెందిన స్త్రీత్వం మూర్తీభవించినట్టు యౌవనం వెన్నెలతో మేళవించి కాంతులీనుతూ, ఆమె జడలోని సన్నజాజుల పరిమళంలా గుబాళిస్తున్నట్టు తోచింది.**

ఎక్కువ చేసింది.

వారి మొదటి రాత్రి మొదటి రాత్రిలా జరగలేదు. భాస్కర్ శారదతో ఎంతో స్నేహంగా మాట్లాడి బెరుకూ, భయం పోగొట్టాడు.

ఆమె కాలేజీ గురించీ, చదువు గురించీ అడిగి, ఆమె కాలేజీ మానేశానని చెప్పగానే నొచ్చుకుని, 'సోమవారం నుంచీ మామూలుగా కాలేజీకి వెళ్ళ'మని చెప్పాడు.

సోమవారం పట్టుచీర కట్టుకుని, నగలు పెట్టుకుని కాలేజీకి వెళ్ళే శారదను లోపలికి పిలిచి, వారించి, కాలేజీకి మామూలుగా వెళ్ళమన్నాడు.

శారద అత్తిల్లు ఖాళీగా నీట్‌గా ఉంది. గోడలకి ఫోటోలు, క్యాలెండర్లు లేవు. అనవసరమైన వస్తువు ఒక్కటి కూడా అక్కడ లేదు.

స్వతంత్రరావుగారు తన గదిలో ఎప్పుడూ ఏదో ఒకటి చదువుతూ, రాస్తూ ఉంటారు. అత్త భాగ్యమ్మ గారు ఇంటి పని, వంటపని చూసుకొంటారు. చదువుకోవడానికి తన ఇంటి వాతావరణం కన్నా ఈ ఇంటి వాతావరణమే చాలా అనుకూలంగా అనిపించింది శారదకు.

నువ్వు వయసులో చిన్నదానివి. అప్పుడే పిల్లలు పుట్టకూడదు. పైగా నువ్వింకా చదువుకోవాలి.' ఆమెను డాక్టర్ దగ్గరికి తీసుకెళ్తూ చెప్పాడు భాస్కర్.

శారదకి చాలా రిలీఫ్‌గా అనిపించింది. భాస్కర్ ఆమెతో ఎప్పుడూ ఒక మంచి స్నేహితుడిలా ప్రవర్తించేవాడు.

కలల రాకుమారులు మాత్రం ఇంకా శారద కలల్లోకి వస్తూనే ఉన్నారు.

శారద ఫైనలియర్ పూర్తి చేసేసరికి వనజకి ముగ్గురు పిల్లలు.

"నువ్వదృష్టవంతురాలివే. ఈ ముగ్గురు పిల్లలతో ఒక సినిమాకు కానీ, షికారుకు కానీ వెళ్ళడమే కుదరదు." గొంతులో ఈర్ష్య ధ్వనిస్తుండగా చెప్పింది వనజ.

శారద బి.ఏ పూర్తవగానే, "నువ్వు ఎమ్.ఏకి చదవాలమ్మాయ్" అన్నారు మామగారు.

వెంటనే దానికి ప్రయత్నాలు జరిగాయి. పైగా చాలా పాఠ్యాంశాలు మామగారు, భర్త బోధిస్తుండేవారు.

భాస్కరరావుకి చందు, శాస్త్రి అని ఇద్దరు స్నేహితులుండేవాళ్ళు. చందూ పెళ్ళికి వ్యతిరేకి. తాను గ్లోబల్ శాక్రిఫైస్ చేస్తున్నట్టు చెప్పేవాడు.

"ఒక్క జెనరేషన్ పిల్లల్ని కనడం మానేస్తే సరి. ప్రపంచంలో చాలా జనాభా తగ్గి, చాలా కాలుష్య నివారణ జరిగి మంచి ప్రపంచమైపోతుంది" అనేవాడు.

స్నేహితులు ముగ్గురూ జనాభా, కాలుష్య నివారణ గురించి మాట్లాడేవాళ్ళు.

తాను ఇద్దరు పిల్లల్ని కన్నందుకు శాస్త్రి భార్య లలిత పశ్చాత్తాపపడుతూ ఉండేది.

అందర్లో తన భర్త గొంతు గంబీరంగా, అతడి భావాలు పదనుగా ఉండడం గమనించేది. తాను చూసే చాలా మంది మగాళ్ళకీ, తన భర్తకీ చాలా తేడా ఉన్నట్టు ఆమెకి అర్థం కాసాగింది.

భాస్కర్‌ని కూడా రామ్మూర్తి బావతో పోల్చుకుంది. క్షణక్షణం, "ఏమే, నా బ్రష్ ఏది? చెప్పులేవి" అంటూ ప్రతి చిన్న పనికీ వనజను వేధించే రామ్మూర్తికీ, తన పనులు తాను స్వయంగా చేసుకోవడమే కాక, తల్లికీ, భార్యకీ సాధ్యమైనంత చేదోడు వాదోడుగా ఉండే భాస్కర్‌కీ పోలికెక్కడ?

రాత్రులు మాత్రం ఇంతకు ముందులా ఎప్పుడూ కాక అప్పుడప్పుడూ ఊహా సుందరులంతా నీట్‌గా డ్రెస్ చేసుకుని, టై కట్టుకుని ఫ్యాషన్ పెరేడ్‌లోకి వచ్చినట్టు వచ్చిపోయేవాళ్ళు.

శారద ఎమ్.ఏ కూడా పూర్తి చేసి బి.ఎడ్ కూడా చదివింది. ఓ రెసిడెన్షియల్ కాలేజీలో లెక్చరర్ పోస్ట్ దొరికిందామెకు.

తనకు తెలియకుండానే మగవాళ్ళని కొలవడానికి తానుపయోగించే కొలమానం మారిపోయింది.

వనజ పిల్లల్నీ, లలిత పిల్లల్నీ చూస్తుంటే శారదకి పిల్లలమీద మనసు పోసాగింది. కానీ, ఆ విషయం భర్త దగ్గర ఎత్తాలంటే సిగ్గుగా ఉందామెకు.

ఆవేళ శారద భాస్కర్‌కి చెప్పకుండానే లలితని వెంట తీసుకొని డాక్టర్ దగ్గరకి వెళ్ళి వచ్చింది.

ఆవేళంతా ఆమెకి తన భర్తని చూస్తుంటే కొత్త వ్యక్తిని చూస్తున్నట్టనిపించసాగింది.

సాయంత్రం తలారా స్నానం చేసి, తెల్లటి హౌస్ కోట్ ధరించి, డాబా మీద వెన్నెల్లో కూర్చున్న భర్తకి దగ్గరగా చేరింది శారద.

భాస్కర్‌కి శారదని చూస్తే ఇంతకు ముందు చిన్నపిల్లలా తోచేది. ఈరోజెందుకో ఆమెలో పరిణతి చెందిన స్త్రీత్వం మూర్తీభవించినట్టు, యౌవనం వెన్నెలతో మేళవించి కాంతులీనుతూ, ఆమె జడలోని సన్నజాజుల పరిమళంలా గుబాళిస్తున్నట్టు తోచింది. అయినా, అతనేమీ మాట్లాడక మౌనంగా ఉన్నాడు.

శారద భర్తనానుకుని అతడి చుట్టూ తన చేయి వేసింది. "ఇవాళ డాక్టర్ దగ్గరికెళ్ళాం నేనూ, లలితా" అంది. ఆమె ముఖకవళికలు గమనించే అతడు ఎందుకని అడగక, "అయితే, నీకు పిల్లల్ని కని చాకే ఓపిక వచ్చిందా..." అంటూ ఏదో చెప్పబోయాడు.

ఆమె మరి అతణ్ణి మాట్లాడనివ్వలేదు. భార్య చొరవ చూసి అతడు మంత్రముగ్ధుడైపోయాడు.

అప్పట్నించీ శారదకి భాస్కర్ శృంగేరిలో చేపలా కాక, శృంగేరి గర్భగుడిలో దేవుడిలా కనిపించాడు. ఈ భావన ఆమెలో కలగగానే కలల రాకుమారులింక ఎన్నడూ ఆమె జోలికి రాలేదు. ■